క్లుప్తంగా

రైల్వే క్రాసింగ్ మూసివేత

చిత్తూరు కార్పొరేషన్: పూతలపట్టు మండలంలోని పి.కొత్తకోట–పాకాల రైల్వే క్రాసింగ్‌ను మరమ్మతు పనుల కారణంగా తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 12 నుంచి 14 వరకు గేటును మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు, వాహనదారులు ఈ మార్పును గమనించాల్సిందిగా కోరారు.

ఓటుహక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెలుగు సభ్యులు

ఐరాల: ఓటుహక్కు వినియోగంపై మండలంలోని నాంపల్లె గ్రామ సమాఖ్య పరిధిలోని మహిళ సంఘ సభ్యులకు గురువారం వెలుగు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు పొంది ఓటును వినియోగించుకోవాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీ మునిరాజు, జిల్లా సంఘమిత్ర యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్, మండల అధ్యక్షుడు మునస్వామి పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ తనిఖీ

యాదమరి: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి గురువారం తనిఖీ చేశారు. మొదట రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీసులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని తమిళనాడు సరిహద్దులో ఉన్నందున చాలా చురుగ్గా ఉండాలని, అనుమానం వచ్చిన వాహనాలను తనిఖీ చేయాలన్నారు. సచివాలయాల్లో ఉన్న మహిళ పోలీసులతో చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

సీఆర్‌పీల జిల్లా నూతన కార్యవర్గం



కృష్ణమూర్తి

బంగారుపాళెం: క్లస్టర్స్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ) వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి (బంగారుపాళెం), గౌరవ అధ్యక్షుడుగా శరత్‌బాబు(యాదమరి), ప్రధాన కార్యదర్శిగా తేజకుమార్(పుంగనూరు), కోశాధికారిగా నందకుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా లత(చిత్తూరు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ, సీఆర్‌పీ వ్యవస్థ ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు విశ్వనాథన్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా

చిత్తూరు అర్బన్: నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. నాలుగో విడత కింద నగర పరిధిలోని 2071 స్వయం సహాయక సంఘాలకు రూ.18.87 కోట్లు జమ కానున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నేడు ఆరోగ్య సురక్ష

బంగారుపాళెం: మండలంలోని బోడబండ్ల గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం వైద్య శిబిరం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హంద్రీ-నీవా నీరు విడుదల

రామకుప్పం: మండలంలోని వర్దికుప్పం సమీపంలో గురువారం హంద్రీ- నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను అధికారులు మరోసారి విడుదల చేశారు. వర్దికుప్పం నుంచి శాంతిపురం మండలంలోకి ప్రవేశిస్తాయి. కాలువలో వచ్చే నీటితో సాగు చేసుకోవచ్చని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

- చంద్రబాబు మాయమాటలను నమ్మొద్దు
- వైఎస్సార్ సీపీ పాలనలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు
- పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్



పూతలపట్టు: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్



చిత్తూరు: జెండామానువీధిలో పర్యటిస్తున్న విజయానందరెడ్డి

బంగారుపాళెం: పేదల సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తున్న పథకాల రారాజుకే మళ్లీ పట్టాభిషేకం చేయాలని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ కోరారు. మండలంలోని సదకుప్పం, వంకమిట్ట, దళితవాడ గ్రామాల్లో గురువారం నాయకులతో కలసి డాక్టర్ సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని సాగించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న నవరత్న పథకాల కరపత్రాలను అందజేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతోపాటు ప్రజల్లోకి నేరుగా వెళ్లే సత్తా వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని వెల్లడించారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుంటే, ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టి జగనన్న చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జరగనున్న ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించి మళ్లీ సీఎంగా గెలిపించు కోవాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత పార్టీలకు, రాజకీయాలకు, కుల మతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయని డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. పేదపిల్లల చదువుల కోసం అమ్మ ఒడి, రైతులకు ఉచిత వ్యవసాయ బోర్లు, పంటల సాగుకు ఆర్థిక సాయం, డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, శ్రామికులకు, చేతి వృత్తులవారికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. కరోనా కష్టకాలంలో ఆర్థిక సంక్షోభం నెలకొన్నా జగనన్న రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లారన్నారు. జగనన్న ప్రవేశపెట్టి అమలు చేసిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.

చంద్రబాబు మాయమాటలను నమ్మొద్దు

చంద్రబాబు పాలనలో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందలేదని సునీల్‌కుమార్ చెప్పారు. ప్రభుత్వ పథకాలు పసుపు చొక్కా నేతలకు, జన్మభూమి కమిటీ సిఫార్సు చేసిన వారికి మాత్రమే లబ్ధి చేకూరిందని తెలిపారు. చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేసిన పాపానపోలేదని చెప్పారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలకు మాయమాటలు చెప్పి మోసగించేందుకు వస్తున్నారని బాబు మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, స్థానిక సర్పంచ్ సుప్రియ, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు శరత్‌రెడ్డి, పార్టీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రఘుపతిరాజు, ఏఎంసీ చైర్మన్ నారేసోమశేఖర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, ఎస్సీ, బీసీ సెల్ కన్వీనర్లు నాగరాజ, దొరస్వామి, మార్కొండ, మైనారిటీ నాయకుడు ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కావాలంటే జగనన్న రావాలి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో సంక్షేమం–అభివృద్ధి బాటల్లో నడిపిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఆదరించాలని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. స్థానిక జెండామానువీధి, తోటపాళ్యం డివిజన్లలో గురువారం ఎన్నికల ప్రచారంలో పర్యటించి మాట్లాడారు. స్థానికంగా ఉండే నాయకులను ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాల నుంచి అభ్యర్థులు బయట ప్రాంతాల నుంచి వచ్చి పోటీచేసి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నట్లు తెలిపారు. జగనన్న హయాంలో అందరికీ అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతున్నాయని వివరించారు. రాష్ట్రం విడిపోవడానికి కారణమైన చంద్రబాబు, ఎప్పటిలాగే ఎన్నికల కోసం మోసపూరిత హామీలు గుప్పిస్తారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాసేవ చేయాలన్న ఆలోచన కల్గిన నాయకులను ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలన్నారు. పక్కరాష్ట్రాల్లో ఉంటూ ఎన్నికలప్పుడు మాత్రం వచ్చి ప్రభుత్వంపై విషం కక్కే వారిని నమ్మొద్దని చెప్పారు. నియోజవర్గం అభివృద్ధి కావాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలన్నారు. అందుకు అందరూ కలిసికట్టుగా ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరారు. గత పాలకుల వైఫల్యంతో చిత్తూరు పలు సంవత్సరాలుగా అభివృద్ధి కాలేదన్నారు. అందరి మేలు కోరే వారిని ఎన్నుకోవాలని వివరించారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షులు టిమ్ము, స్థానిక కార్పొరేటర్, శశి, నాయకులు పిచ్చాండి, శివ, గణేష్, వెంకట్, మురుగన్, జగ్గా, మురళీ, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు తప్పనిసరి

- చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య
- ఓటర్ల జాబితాపై దృష్టి పెట్టాలి
- హాజరైన 260 మంది బీఎల్వోలు





సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య, హాజరైన నియోజకవర్గ బీఎల్వోలు, అధికారులు

పూతలపట్టు: నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా వసతులు కల్పించాలని చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. మండలంలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నియోజకవర్గంలోని తహసీల్దార్లు, బీఎల్వోలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితా విషయంలో బీఎల్వోలు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇది ఎంత మాత్రం తగదని హెచ్చరించారు. ఎన్ని సార్లు సర్వేలు చేసినా చిన్నచిన్న పొరబాట్లు చేస్తున్నారని చెప్పారు. బీఎల్వోలకు కేటాయించిన పోలింగ్ పరిధిలోని ఓటర్ల వివరాలను పరిశీలించిన తర్వాతనే వాటిని నమోదు చేయాలని సూచించారు. తుది జాబితానంతరం ఫారం 7, 8లు తప్పనిసరిగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. వార్తల్లో ప్రచురితమవుతున్న డబుల్ ఎంట్రీలు, ఫొటోలు మార్పులు వంటి వాటిని గమనించకుండా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఓటర్లు జాబితాలో తప్పులు ఉండి వాటిని ఓటర్లు గుర్తించకుంటే వెంటనే ఆ బీఎల్వోలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కావున బీఎల్వోలు మరోసారి వారికి కేటాయించిన ఓటర్ల జాబితాను సరిచూసుకోవాలని తెలిపారు. నియోజకవర్గంలోని 260 పోలింగ్ స్టేషన్లలో అత్యవసర సదుపాయాలను కల్పించాలని తహసీల్దార్లను ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, మరుగుదొడ్లు, బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, ఓటర్లు వేచి ఉండేందుకు విశాలమైన స్థలం వంటివి ఇప్పటి నుంచే చూసుకోవాలని తహసీల్దార్లు, డీటీలు, బీఎల్వోలకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిత్యవసర సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. ఇంకోవారం ఓటర్ల జాబితా ఫారం7,8లను పూర్తి చేయాలని బీఎల్వోలకు ఆదేశించారు. బీఎల్వోల పనితీరును ఆయా తహసీల్దార్లు, డీటీలు ఎల్లప్పుడూ పరిశీలించాలని తెలిపారు. వారితీరు ఆలాగే కొనసాగితే వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు తెలిపారు. కార్యక్రమంలో పూతలపట్టు, ఐరాల, యాదమరి, తవణంపల్లి, బంగారుపాళెం మండలాల తహసీల్దార్లు, డీటీలు, 260మంది బీఎల్వోలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ఫ్యామిలీ డాక్టర్ భరోసా



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ప్రభుత్వం వినూత్నంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

బంగారుపాళెం: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో అంబేడ్కర్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి గురువారం జైభీమ్ సేవా సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప ప్రభుత్వం ద్వారా రూ.50 లక్షలు మంజూరు చేయించారు. అంబేడ్కర్ మండల కమిటీ గౌరవ అధ్యక్షుడు దేవయ్య మాట్లాడుతూ, భవన నిర్మాణానికి మొదటి విడతగా రూ.25 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో పనులను చేపట్టినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సోమశేఖర్, ఎంపీటీసీ ఉష, ఉపసర్పంచ్ కామరాజు, అంబేడ్కర్ కమిటీ అధక్షుడు నవీన్‌కుమార్, దళిత నాయకులు చంద్రన్, రాజశేఖర్, గోవిందు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవర్తన పట్టిక రూపకర్త మెన్‌డెలీవ్



మెన్‌డెలీవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు



ఆవర్తనపట్టిక ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన

బంగారుపాళెం: ఆవర్తన పట్టిక నిర్మాణకర్త మెన్‌డెలీవ్ అని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్‌సుభాన్ అన్నారు. పాఠశాలలో గురువారం శాస్త్రవేత్త మెన్‌డెలీవ్ జయంతిని విద్యార్థుల మధ్య నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ రష్యాకి చెందిన రసాయనశాస్త్రవేత్త మెన్‌డెలీవ్ 1834 ఫిబ్రవరి 8న జన్మించారన్నారు. ఆయన మూలకాలను శాస్త్రబద్ధంగా వర్గీకరించి, పీరియాడిక్ టేబుల్‌ను రూపొందించారని చెప్పారు. సైన్స్ ఉపాధ్యాయులు షంషీర్‌ఖాన్, విజయకుమారి మాట్లాడుతూ, మెన్‌డెలీవ్ కనిపెట్టిన ఆవర్తన నియమం ఆధారంగా మూలకాల వర్గీకరణ సాధ్యమైందన్నారు. దాని ఆధారంగానే నవీన ఆవర్తనపట్టిక నిర్మాణం సాధ్యమైందని తెలిపారు. విద్యార్థులు మెన్‌డెలీవ్‌ను ఆదర్శంగా తీసుకుని సైన్స్‌లో నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ఆవర్తన పట్టిక ఆకారంలో కూర్చుని మెన్‌డెలీవ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణురెడ్డి, కేశవులు, వెంకటస్వామి, దేవకి, అన్నపూర్ణదేవి, శుభలక్ష్మి, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

10న వాలీబాల్ పోటీలు

బైరెడ్డిపల్లె: బాట గంగమ్మ జాతర సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఈనెల 10న బైరెడ్డిపల్లెలో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. విన్నర్స్‌కు రూ.50వేలు, రన్నర్స్‌కు రూ.30వేలు, మూడవ బహుమతి రూ.20వేలు, 4వ బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్టు చెప్పారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామన్నారు. ఫుట్‌బాల్ క్రీడాకారులైన శేఖర్‌గౌడు, లియాఖత్ ఆలీ, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్, హనుమంతురెడ్డి స్మారకార్థం నిర్వహించనున్న ఈ పోటీలలో ఉమ్మడి జిల్లాల వారే కాకుండా ఏ ప్రాంతం వారైనా పాల్గొనవచ్చన్నారు. ఆసక్తిగల వారు 9703226723, 9908585899, 9652929909 నంబర్లకు సంప్రదించి జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

అతను వలంటీర్ కాదు.. టీడీపీ కార్యకర్తే!

బంగారుపాళ్యం: సంక్షేమ పాలన అందించి ప్రజలు జగనన్నకు నీరాజనం పడుతుండడంతో బెంబేలెత్తిన టీడీపీ రాష్ట్రంలో ఉనికిని చాటుకోవడానికి అడ్డదారులు తొక్కుతోంది. మొన్నటికి మొన్న టీడీపీ కార్యకర్తలకే పచ్చకండువాలు కప్పి పార్టీలో చేరినట్లు మాజీ మంత్రి అమరనాథరెడ్డి ప్రచారం చేసుకోగా, తాజాగా పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జ్ మురళీ మోహన్ కూడా ఇలాంటి ప్రచారం చేసుకున్నారు. బంగారుపాళ్యం మండలం చిలగుండ్లపల్లె పంచాయతీలో 6 నెలల క్రితం విధుల నుంచి తొలగించిన వలంటీర్‌కు పూలమాల వేసి, పార్టీలో చేరినట్లు ఫొటోలు దిగి ప్రచారం చేసుకున్నారు. దీనిపై స్పందించిన సర్పంచ్ దీప అసలు విషయం వెల్లడించారు. చిలగుండ్లపల్లెకు చెందిన వేదవ్యాసులు టీడీపీ కార్యకర్త అయినప్పటికీ వలంటీర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే నిష్పక్షపాతంగా వ్యవహరించిన అధికారులు అతడిని వలంటీర్‌గా నియమించారు. ఇదే అదనుగా వేదవ్యాసులు ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించకుండా, ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో 6 నెలల క్రితమే అతడిని విధుల నుంచి తొలగించారు. అయితే గురువారం మండలానికి వచ్చిన టీడీపీ ఇన్‌చార్జి అతను వలంటీర్‌గా రాజీనామా చేసి పార్టీలో చేరినట్లు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని సర్పంచ్ తెలిపారు.

18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటుహక్కు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

గుడిపాల: మండలంలో 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటుహక్కు పొందాలని వెలుగు సీసీ హేమచంద్రారెడ్డి అన్నారు. 189 కొత్తపల్లెలో గురువారం మహిళాసంఘాల సభ్యుల ద్వారా గ్రామంలో ఓటర్లపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరూ బీఎల్‌ఓల వద్ద ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. కొత్త ఓటర్లకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

నెలాఖరులోపు మరమ్మతులు పూర్తి చేయండి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య

పూతలపట్టు: మండలంలోని ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో నెలాఖరులోపు మరమ్మతులు పూర్తి చేయాలని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. మండలంలోని తేనేపల్లి, వడ్డేపల్లి తదితర పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్, డీటీలతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో వసతులను పూర్తి స్థాయిలో కల్పించాలని తెలిపారు. మరమ్మతులు, విద్యుత్, బెంచీలు వంటివి నెలాఖరులోపు పూర్తి చేసుకోవాలని అధికారులకు సూచించారు. పోలింగ్ జరిగే విధానాలను, రూటు మ్యాపును బీఎల్వోలకు వివరించారు. వీరితో పాటు తహసీల్దార్ శివరాముడు, డీటీ(ఎన్నికలు) మహేశ్వరి, బీఎల్వోలు పాల్గొన్నారు.

డీఈఓకు శుభాకాంక్షల వెల్లువ



డీఈఓకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఈఓ దేవరాజును పలు సంఘాల నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందజేశారు. జిల్లాలో విద్యాభివృద్ధి, టీచర్ల సమస్యల పై డీఈఓ తో చర్చించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోమశేఖరనాయుడు, మణిగండన్, నాయకులు ఎస్‌పీ బాషా, రెహాన, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పరంజ్యోతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీఓ సింగయ్య సూచించారు. ఆయన గురువారం ఉపాధి హామీ పథకానికి సంబంధించి రికార్డులను పరిశీలించారు. జాబ్ కార్డులు, కూలీల సంఖ్య, పూర్తయిన పనులు తదితర వివరాలను ఆరా తీశారు. కూలీల సంఖ్య తక్కువగా ఉండడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో ప్రజలకు, రైతులకు సమావేశం ఏర్పాటు చేసి వెంటనే అవగాహన కల్పించాలని ఆదేశించారు. సచివాలయాల్లో ఉన్న ఉద్యోగులు, ప్రజలకు సేవలు అందించాలన్నారు. వలంటీర్లు తమకు కేటాయించిన 50 గృహాలకు వెళ్లి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సూచించారు. మండల పరిధిలో అధికారులు చాలా నిర్లక్ష్యంగా ఉన్నారని, ప్రభుత్వ పథకాలకు సంబంధించి నివేదికలు సిద్ధంగా ఉండాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డుపై వారపు సంతతో ఆటంకాలు

- రాకపోకలకు అంతరాయం
- పట్టించుకోని పోలీసు యంత్రాంగం

తవణంపల్లి: మండలంలోనే మేజర్ పంచాయతీ అరగొండలో రోడ్డుపై వారపు సంత నిర్వహించడంతో రాకపోకలకు ఆటంకాలు తప్పడం లేదు. ద్వారా ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా...వ్యాపారులకు, కొనుగోలుదారులకు సౌకర్యాలు కల్పించడంలో పంచాయతీ అధికారులు విఫలమవుతున్నారు. అరగొండ వారపుసంత ద్వారా ఏడాదికి రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తోంది. దినసరి మార్కెట్ ద్వారా ఏటా రూ.2.50 లక్షల ఆదాయం వస్తున్నది. అరగొండ- బంగారుపాళెం రోడ్డు, అరగొండ- కామాలూరు రోడ్డుపైన ప్రస్తుతం వారపు సంత నిర్వహిస్తున్నారు. అరగొండ మీదుగా అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానానికి వెళ్లే మార్గం భక్తులతో రద్దీగా ఉంటుంది. దీనితో పాటు కామాలూరు, ఈచనేరి మీదుగా కాణిపాకం వెళ్లే మార్గంలోనూ వాహనాల రాకపోకలు అధికంగానే ఉంటాయి. రోడ్డుపైన సంత నిర్వహించరాదని మండల సర్వసభ్య సమావేశంలోనూ చర్చించారు. కానీ మండల స్థాయి అధికారులు, పంచాయతీ అధికారులు, పోలీసులు దీనిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు సతమతమవుతున్నారు. గతంలో రద్దీవల్ల పలు మార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి చైతన్యను సంప్రదించగా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో వారపు సంత ద్వారా రూ.5 లక్షలు ఆదాయం వచ్చింది. కానీ సంత ఏర్పాటు గురించి గతంలో ఎంపీడీఓ కూడా పరిశీలించారని చెప్పారు. కానీ స్థలం సేకరణకు తహసీల్దార్, సర్పంచ్‌తో చర్చించిన తరువాత అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.





అరగొండలో రోడ్డుపైనే వారపు సంతలో కొనుగోలు, విక్రయదారులు, రాకపోకలకు అంతరాయం కలగడంతో రోడ్డుపైనే నిలిచిపోయిన వాహనాలు

వరసిద్ధుని సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి



న్యాయమూర్తితో ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లె నంద దర్శించుకున్నారు. ఆమె గురువారం స్వామివారి దర్శనార్థం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.